సాక్షి
జోగులాంబ గద్వాల
శుక్రవారం । 31 । మే । 2024



పొగాకు నిర్మూలిద్దాం..
చిన్న, పెద్ద అనే తేడా లేకుండా పొగాకు మోజులో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.
వివరాలు 8లో ▸



ఉర్సు ప్రారంభం
అలంపూర్‌లో షాఅలీ పహిల్వాన్ ఉర్సు గురువారం గంధోత్సవంతో ప్రారంభమైంది.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
41.3 /26.9
నేడు ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం, సాయంత్రం ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలం

గద్వాల అర్బన్: ప్రభుత్వం సీడ్‌పత్తి రైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీ.కే ఈదన్న ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నడిగడ్డలో 40వేల మంది రైతులు సీడ్‌పత్తిని సాగు చేస్తున్నారన్నారు. అయితే, 2015, 2016 సంవత్సరాల్లో వైరస్ సోకి సుమారు 57వేల ఎకరాలు, 2017, 2019, 2023 సంవత్సరాల్లో ఎర్రతెగులు సోకి పంట నష్టపోయారన్నారు. కానీ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అధికార యంత్రాంగం, ప్రభుత్వం స్పందించి సీడ్ పత్తి రైతులకు న్యాయం చేయాలని, కంపెనీలు నేరుగా రైతులతో ఒప్పందం చేసుకోవాలని, ప్యాకెట్‌కు రూ.700ధర ఇవ్వాలని, ఎకరాకు రూ.2లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని, పంటలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, జిన్నింగ్ అయిన 50రోజుల్లోనే రైతులకు డబ్బులు చెల్లించాలని తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు మద్దిలేటి, నర్సింహులు, ఆంజనేయులు, వీవీ నర్సింహ్మా, మల్లేష్, శివన్న తదితరులు ఉన్నారు.

వేరుశనగ క్వింటా రూ.5909

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు గురువారం 79 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 5909, కనిష్టం రూ. 4592, సరాసరి రూ. 5619 ధరలు పలికాయి. 88 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ. 2489, కనిష్టం రూ. 1789, సరాసరి ధర రూ. 1789 ధరలు వచ్చాయి.

పీఏసీఎస్‌ల బలోపేతానికి కృషి

గద్వాల రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు బలోపేతం అయితేనే డీసీసీబీ అభివృద్ధి చెందుతుందని డీసీసీబీ చైర్మన్ వెంకటయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటుహోటల్లో జిల్లా స్థాయి పీఏసీఎస్ చైర్మన్లు, కార్యదర్శులు, బ్యాంకు సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 సంవత్సరంలో రూ.11కోట్ల లాభాలను ఆర్జించిందని ఇది అందరి కృషి వల్లనే సాధ్యపడిందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని పీఏసీఎస్‌ల చైర్మన్లు, కార్యదర్శులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్ష

వనపర్తి: జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని.. అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించమని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వెబెక్స్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభ్యర్థులు జూన్ 1 మధ్యాహ్నం రెండు గంటల నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. కేంద్రాల్లోకి ఎల్రక్టానిక పరికరాలు, సెల్‌ఫోన్లు, గడియారాలు, బంగారు ఆభరణాలు, ప్యాడ్లు, పేపర్లు, బ్యాగ్‌లు, బుక్‌లు, చార్ట్ వంటివి తీసుకురావద్దని సూచించారు. చెప్పులు మాత్రమే ధరించి పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 10లోపు కేంద్రాలకు చేరుకోవాలని.. 9.30 నుంచి బయోమెట్రిక్ హాజరు తీసుకుంటారని ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని తెలిపారు. హెల్ప్‌డెస్క్ నంబరు 08545–233525కు ఫోన్‌చేసి సమాచారం తీసుకోవచ్చని తెలిపారు.

● ఒత్తిళ్లు.. బెదిరింపులు..

అయ్యగారికే శరగోపం..!

ఆలయ కమిటీ చైర్మన్: పంతులూ..నీకు ప్రభుత్వం నుంచి నెలకు రూ.10 వేలు వస్తున్నాయి కదా. పూజా ద్రవ్యాల కోసం మాకు రూ.4 వేలు ఇవ్వు. స్వీపర్‌కు జీతం నీవే ఇవ్వాలి.

అర్చకుడు: నాకే నెల నెల జీతం సరిగా రాదు. వీటి నుంచి నేను మీకెందుకు ఇవ్వాలి?

ఆలయ కమిటీ చైర్మన్: అయితే నిన్ను తొలగించి, నీ స్థానంలో వేరొక అర్చకుడిని నియమిస్తాం.

... ఇది మహబూబ్‌నగర్ పట్టణం పద్మావతి కాలనీలో ఉన్న ఓ ఆలయానికి సంబంధించి కమిటీ చైర్మన్, అర్చకుడి మధ్య జరిగిన సంభాషణ. దీనిపై సదరు చైర్మన్ మాట్లాడుతూ 'ఆలయానికి ధూప, దీప, నైవేద్య పథకం మంజూరైంది. దీని కింద అర్చకుడికి రూ.10 వేల వేతనం వస్తుంది. కాబట్టి పూజ సామగ్రితో పాటు స్వీపర్ వేతనాన్ని అర్చకుడే భరించాలని చెప్పాం. అతడు అంగీకరించలేదు. మరో అర్చకుడిని చూసుకుంటున్నాం.'అని సమాధానం ఇవ్వడం ధూప, దీప, నైవేద్య ఆలయాల్లో అర్చకులపై ఒత్తిళ్లు, బెదిరింపులకు నిదర్శనంగా నిలుస్తోంది.



పర్యవేక్షణ లేకపోవడమే కారణం

ధూప, దీప, నైవేద్య పథకంపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించక పోవడం, ఏళ్ల తరబడి పట్టింపులేమి కారణంగా వ్యవస్థ గాడి తప్పింది. ఆలయ అర్చకులపై కమిటీలు పెత్తనం, ఒత్తిళ్లతో బాధలు పడుతున్న అర్చకులు ఒక వైపు కాగా.. ఈ పథకం కింద పనిచేస్తున్న వారిలో పలువురు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. రూ.10 వేల వేతనం తీసుకుంటున్నా.. సమయపాలన పాటించడం లేదు. కొన్ని ఆలయాల్లో అయితే అర్చకులు విధుల్లోనే ఉండని పరిస్థితి ఉంది. అంతేకాదు లేని ఆలయాలను ఉన్నట్లు చూపించి.. దేవాదాయ శాఖను తప్పుదోవ పట్టించి ధూప, దీప, నైవేద్య పథకం కింద నెలనెల రూ.10 వేలు పొందుతున్నారు.

అడకత్తెరలో ధూప, దీప, నైవేద్య అర్చకులు

- పూజారులపై కమిటీ సభ్యుల వేధింపులు
- రూ.10 వేల వేతనంలో వాటా ఇవ్వాలని ఒత్తిళ్లు
- మాట వినని అర్చకులను మార్చే కుట్ర
- క్షేత్రస్థాయిలో కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- గాడి తప్పిన వ్యవస్థ.. ఒక్కో చోట ఒక్కోలా..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ధూప, దీప, నైవేద్య పథకం కింద ఆలయాల్లో పనిచేసే అర్చకుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నట్లు తయారైంది. ఈ స్కీంలో ప్రభుత్వం నుంచి రూ.10 వేల వేతనం వస్తుందని ఆశగా ఎదురుచూసే పూజరులకు నాలుగైదు నెలలైనా వేతనాలు పడడం లేదు. సందెట్లో సడేమియా అన్నట్లు ఆలయ కమిటీ సభ్యులుగా చెప్పుకునే పలువురు.. అర్చకులను టార్గెట్ చేశారు. తమ వేతనం నుంచి కనీసం 40 శాతం వాటా ఇవ్వాలంటూ వారిని ఒత్తిళ్లకు గురిచేస్తున్నారు. మాట వినని, పట్టించుకోని అర్చకుల స్థానంలో వేరే వారిని నియమించే కుట్రలను తెరలేపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 689 ధూప దీప నైవేద్య ఆలయాలు ఉండగా.. మెజార్టీ ఆలయాల్లో ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ఈ క్రమంలో పలు చోట్ల ఆలయ కమిటీలు, అర్చకుల మధ్య కోల్డ్ వార్ తీవ్రరూపం దాల్చగా.. వాటాలు, ఒత్తిళ్ల, బెదిరింపుల పర్వంపై 'సాక్షి' పరిశోధనాత్మక కథనం..



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

దివంగత నేత వైఎస్సార్ హయాంలో పథకం షురూ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ధూప, దీప, నైవేద్య పథకం అమల్లోకి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో అర్చక స్వాములకు ఉపాధి మార్గం లేక పట్టణాలకు వలస పోయేవారు. దీంతో అక్కడి ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాలు లేక గుడి గంటలు మూగబోయి, ఆలయాలు అంధకారంలో ఉండిపోయాయి. హైందవ ధర్మానికి పునాది అయిన ఆలయాల్లో వెలుగులు నిండాలని అప్పట్లో అర్చక సమాఖ్య విజ్ఞప్తి మేరకు వైఎస్సార్ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద ఆలయాల్లో ధూప, దీప, నైవేద్య పథకం కింద అర్చకులకు రూ.2,500 వేతనాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో అర్చకుడి భృతికి రూ.1,500, ధూప, దీప, నైవేద్య ఖర్చులకు రూ. 1,000 కేటాయించారు. రానురాను ఈ పథకం రూ. 6 వేల నుంచి ఇప్పుడు రూ.10 వేలకు చేరుకుంది.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



ధూప, దీప, నైవేద్య పథకం కింద అర్చకులను వాటా అడుగుతున్న విషయం వాస్తవమే. కాదని అర్చకులు ఎదురు తిరిగితే వారి స్థానంలో వేరే అర్చకులను పెట్టిస్తామని బెదిరిస్తున్నారు. చాలా చోట్ల అర్చకులు తప్పని పరిస్థితుల్లో డబ్బులు ఇస్తున్నారు. ఈ విషయాన్ని దేవాదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– పీవీ లక్ష్మీకాంత్ ఆచార్యులు, అర్చక సంఘం అధ్యక్షుడు, వనపర్తి

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం..



అర్చకుడికి ప్రభుత్వం చెల్లించే వేతనాలు వారికే చెందుతాయి. అర్చకుడి వేతనంలో వాటా అడగడం సరికాదు. ఈ విషయం నా దృష్టికి కూడా వచ్చింది. అదేవిధంగా ధూప, దీప, నైవేద్యం పథకంలో అర్చకులు కొన్ని చోట్ల పూజలు చేయడం లేదని తెలిసింది. వీటిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. పారదర్శకంగా ఉంటేనే వేతనాలు చెల్లిస్తాం.
– వెంకటేశ్వరి, ఇన్‌స్పెక్టర్, దేవాదాయశాఖ

ఒక్కో ఆలయం.. ఒక్కో రకంగా..

■ జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలంలో ఈ పథకం కింద ఆరు ఆలయాల్లో అర్చకుల దగ్గర రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వాటాలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఓ ఆలయ కమిటీ సభ్యుడు అర్చకుడితో 'నెల నెల ప్రభుత్వం నుంచి నీకు రూ.10 వేలు వస్తున్నాయి. నీవు సరిగా గుడికి రావు. కాబట్టి ఇందులో మాకు సగం వాటా ఇవ్వాలి. లేకపోతే నీపై ఫిర్యాదు చేసి తొలగిస్తాం.' అని హెచ్చరించారు. ఈ వాటాల ఒత్తిడి భరించలేక రాజోళి మండలంలోని ఓ అర్చకుడు స్వచ్ఛందంగా రాజీనామ లేఖ ఇవ్వగా.. మరో అర్చకుడు చేసేదేమీ లేక పాలకమండలికి నెలకు రూ.2 వేల వాటా ఇస్తున్నట్టు సమాచారం.

■ మహబూబ్‌నగర్ పద్మావతి కాలనీలోని ఓ ఆలయంలో కూడా అర్చకుడిపై పాలకమండలి ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. అర్చకుడికి వచ్చే వేతనంలో కొంత స్వీపర్‌కు చెల్లించాలని హుకూం జారీ చేసినట్లు సమాచారం. సదరు అర్చకుడు కాదనే సరికి అతడి స్థానంలో మరో అర్చకుడిని ఏర్పాటు చేసేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

■ వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం చౌదరపల్లిలోని ఓ ఆలయంలో పనిచేసే అర్చకుడి నుంచి పాలక మండలి సభ్యులు రూ.4 వేలు అడుగుతున్నట్లు సమాచారం.

రైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలం

గద్వాల అర్బన్: ప్రభుత్వం సీడ్‌పత్తి రైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీ.కే ఈదన్న ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నడిగడ్డలో 40వేల మంది రైతులు సీడ్‌పత్తిని సాగు చేస్తున్నారన్నారు. అయితే, 2015, 2016 సంవత్సరాల్లో వైరస్ సోకి సుమారు 57వేల ఎకరాలు, 2017, 2019, 2023 సంవత్సరాల్లో ఎర్రతెగులు సోకి పంట నష్టపోయారన్నారు. కానీ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అధికార యంత్రాంగం, ప్రభుత్వం స్పందించి సీడ్ పత్తి రైతులకు న్యాయం చేయాలని, కంపెనీలు నేరుగా రైతులతో ఒప్పందం చేసుకోవాలని, ప్యాకెట్‌కు రూ.700ధర ఇవ్వాలని, ఎకరాకు రూ.2లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని, పంటలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, జిన్నింగ్ అయిన 50రోజుల్లోనే రైతులకు డబ్బులు చెల్లించాలని తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు మద్దిలేటి, నర్సింహులు, ఆంజనేయులు, వీవీ నర్సింహ్మా, మల్లేష్, శివన్న తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

- ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు
- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అందించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయశాఖ అధికారులు, విత్తన కంపెనీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా విత్తన కంపెనీలు మంచి విత్తనాలను అందజేయాలన్నారు. అదేవిధంగా జిల్లాలో పంటలకు అనుకూలమైన వాతావరణం ఉన్నందున పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, వసాయశాఖ నిర్దేశించిన ప్రామాణికాల మేరకే విత్తనాలను విక్రయించాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు కంపెనీలతో సమన్వయం చేసుకుని రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఏవో గోవిందునాయక్, ఏడీఏ వెంకటలక్ష్మీ, ఏవోలు, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

ఎరువులు, విత్తనాలలో కృత్రిమ కొరత సృష్టించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించారు. ప్రతి ఎరువులు, విత్తన దుకాణ డీలర్లు షాపు ముందు తప్పనిసరిగా ఎరువులు, విత్తనాలకు సంబంధించి స్టాక్‌బోర్డు వివరాలు ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయించే షాపులలో తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పీడీ యాక్టు కింద కేసు నమోదు చేయాలన్నారు. జూన్ 15వ తేదీ వరకు వ్యవసాయ అధికారులు నిరంతరంగా షాపులను తనిఖీలు నిర్వహిస్తూ విత్తనాలు, ఎరువుల విక్రయాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఏవో గోవింద్ నాయక్, అన్ని మండలాల ఏవోలు పాల్గొన్నారు.

నిరాడంబరంగా అవతరణ దినోత్సవం

జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిరాడంబరంగా నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. ఐడీవోసీ కార్యాలయంలో మీటింగ్ హాలులో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. ఎన్నికల కోడ్ కొనసాగుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిరాడంబరంగా నిర్వహించుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొనే కార్యక్రమంలో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉదయం 8:30గంటలకు పతాకావిష్కరణ కార్యక్రమాన్ని పూర్తిచేయాలన్నారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ఉదయం 9గంటలకు పతాకావిష్కరణ కార్యక్రమంలో అందరూ కూడాపాల్గొనాలన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులను స్మరించుకోవడం, గౌరవించడం ముఖ్యమని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అపూర్వ్‌చౌహాన్, ముసిని వెంకటేశ్వర్లు, ఆర్డీవో రాంచందర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో యూనిఫామ్స్ అందజేయాలి

గద్వాల రూరల్: పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అన్ని పాఠశాలల విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులను అందజేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం గద్వాల మండలం అనంతపురం గ్రామంలోని మహిళాసంఘం సభ్యులు ఆధ్వర్యంలో స్టిచ్చింగ్ చేస్తున్న విద్యార్థుల డ్రెస్సులను పరిశీలించారు. మొత్తం విద్యార్థుల సంఖ్య అందుకు సరిపడా డ్రెసులు ఎన్ని సిద్ధం చేశారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళాసంఘం సభ్యులు ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం స్కూల్‌డ్రెస్సులను కుట్టే బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. అదేవిధంగా భవిష్యత్తులో అంగన్‌వాడీ కేంద్రాలలో సైతం డ్రెస్సులు కుట్టేందుకు ప్రభుత్వం అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇందుకు తగ్గట్టుగా ముందస్తుగానే సిద్ధం కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 27,823మంది బాలురులు, 26073 బాలికల విద్యార్థులకు డ్రెస్సులు కుట్టేందుకు మొత్తం 52 కుట్టు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 40శాతం మేర డ్రెస్సులు సిద్ధమైనట్లు అధికారులు తెలుపగా, మిగిలినవి కూడ త్వరలోనే పూర్తి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీవో నర్సింగ్‌రావు, ఏపీడీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు పక్కాగా ఏర్పాట్లు



నాగర్‌కర్నూల్‌లో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్లు ఉదయ్‌కుమార్, తేజస్ తదితరులు

నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రం శివారులోని నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో వచ్చే నెల 4న జరగనున్న పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అలంపూర్, గద్వాల, వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి 7 అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు కేంద్రాలను గురువారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్, వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు. స్ట్రాంగ్‌రూంలు, కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రతపై పోలీస్ అధికారులతో చర్చించారు. స్ట్రాంగ్‌రూంల వద్ద నిరంతర నిఘా కొనసాగించాలని, ఇతరులు లోపలికి రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ చేపట్టేందుకు నియోజకవర్గాల వారీగా ఒక్కో దానికి 14 టేబుళ్ల ఏర్పాటు చేయాలన్నారు. వారి వెంట వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల అదనపు కలెక్టర్ల తదితరులున్నారు.

ప్లాస్టిక్ నిషేధం.. అమలైతేనే ప్రయోజనం

- జిల్లాలో ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు
- కఠిన చర్యలపై అధికారులపై దృష్టి

గద్వాల: ప్లాస్టిక్ వస్తువులతో పర్యావరణంతో పాటు మానవవాళిక ముప్పుపొంచి ఉన్నా నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. ఫలితంగా వీటి వినియోగం అంతకంతకూ పెరుగుతోంది. పట్టణాల్లోని రహదారుల పక్కన, నివాస గృహాల సమీపంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాల్లే కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌పై నిషేధం ఉండేది. ప్రస్తుతం 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌పై నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సమస్యలను అధిగమించాలంటే.. వ్యక్తిగతంగా, సమష్టిగా ముందడుగు వేయాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో రోజు 10 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో సుమారు 30 వేల నివాస గృహాలు, దుకాణాలు ఉన్నాయి. 80 టన్నుల చెత్త రోజుకు ఉత్పత్తి అవుతోంది. అందులో పది టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. గతంలోనే గద్వాల, అయిజ మున్సిపాలిటీలలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేశారు. అప్పట్లో అడపాదడపా దుకాణాలపై దాడులు నిర్వహించారు. రూ.100 నుంచి రూ.5 వేల వరకు జరిమానాలు సైతం విధించారు. తదనంతరం అధికారుల పర్యావేక్షణ సరిగా లేకపోవడం.. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తిరిగి వాటి విక్రయాలను మొదలపెట్టారు. ఏళ్ల తరబడి ప్రణాళికలు రూపొందిస్తున్నా.. కౌన్సిల్‌లో తీర్మాణాలు చేస్తున్నా అమలులో క్షేత్రస్థాయి లోపాలతో అడ్డుకట్ట పడని పరిస్థితి ఉంది.



జిల్లా కేంద్రంలోని కాల్వలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

మున్సిపాలిటీల్లో ముమ్మర తనిఖీలు

ప్రస్తుతం ప్లాస్టిక్ నిషేధానికి అధికారులు మళ్లీ నడుం బిగించారు. గడిచిన కొన్ని రోజులుగా ఆయా మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన గద్వాలలో ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టర్ సంతోష్ ఆదేశాలతో నిత్యం ఉదయం, సాయంత్రం దుకాణాలపై దాడులు చేసి చర్యలు తీసుకుంటున్నారు. కూరగాయల మార్కెట్‌తో పాటు హోల్‌సెల్, రిటేల్ దుకాణాల్లో వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని కార్యాయాలకు తరలించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి రాజకీయ ఒత్తిళ్లు వచ్చిన ఎక్కడ తగ్గకుండా దాడులు కొనసాగిస్తు అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ప్రజల్లో మార్పు రావాలి



ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. పాలిథిన్ కవర్లకు బదులు ఇతర సంచులు వాడాలని, తద్వారా ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యమవుతుంది. ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే వంద శాతం నిర్మూలన సాధ్యమవుతుంది. ప్లాస్టిక్ విక్రయాలు చేస్తే జరిమానాలతో పాటు దుకాణం లైసెన్సు రద్దు చేస్తాం.
– శంకర్‌సింగ్, కమిషనర్, గద్వాల

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

గట్టు: అంబేడ్కర్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని, బడుగు బలహీన వర్గాలు ఐకమత్యం కావాలని ప్రొఫెసర్ కాశీం కోరారు. గురువారం గట్టు బస్టాండ్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాశీం మాట్లాడుతూ.. చదువుతోనే పేదరికాన్ని దూరం చేయవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచన విధానం ప్రకారం నడుచుకోవాలని, అదే ఆ మహనీయునికి మనం ఇచ్చే ఘనమైన నివాళి అని తెలిపారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ గ్రంథాన్ని కాపాడుకుంటూ, ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని చదువుకోవాలని కోరారు. గట్టు మండలాన్ని అక్షరాస్యతలో ముందుకు తీసుకురావడానికి ఇక్కడి వారందరూ తప్పని సరిగా చదువుకోవాలని కోరారు. చదువు ద్వారానే పేదల బతుకులు. జీవితాలు మారుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్, తప్పెట్లమొర్సు శ్రీను, గట్టు మారెన్న, నిర్వాహకులు మహేష్, నర్సింహులు, ప్రాన్సిస్, గోపాల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



గట్టులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కాశీం

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల-2లో గురువారం ఉదయం పొలంలో ఉన్న విద్యుత్ వైర్లు చేతికి తగిలి రైతు మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ ఉన్నూరుబాషా (45) గురువారం ఉదయం కౌలుకు వేసుకున్న పది ఎకరాల పొలంను ట్రాక్టర్‌తో దున్నిస్తు తిరుగుతుండగా వేలాడుతున్న వైర్లు ఆయన చేతికి తగిలాయి. దీంతో ఆయన షాక్‌కు గురికావడంతో పెద్ద కుమారుడు చూసి కర్రతో వైరును పక్కకు తోడంతో అతనిని చికిత్స కోసం కర్నూల్ తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య షేక్ శాలిబి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు.

తేనెటీగల దాడిలో ట్రాక్టర్ డ్రైవర్..


వెంకట్‌రాములు (ఫైల్)

గండేడ్: పొలం దున్నడానికి ట్రాక్టర్‌తో వెళ్లిన వ్యక్తిపై తేనెటీగలు దాడి చేశాయి. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని లింగాయిపల్లికి చెందిన జీడీ వెంకట్రాములు (36) సోమవారం మధ్యాహ్నం ట్రాక్టరు తీసుకుని రంగారెడ్డిపల్లికి చెందిన ఓ రైతు పొలం దున్నడానికి ఎర్రగుంటకు వెళ్లాడు. ఒంటి గంట ప్రాంతంలో పొలం దున్నుతుండగా పెద్ద తేనెటీగలు దాడి చేశాయి. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం గండేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అంబులెన్సులో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతనికి మంగళవారం పెరాలసిస్ వచ్చింది. అదే రోజు రాత్రికి పూర్తిగా కోమాలోకి వెళ్లిపోయాడు. పరిస్థితి విషమించడంతో గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ఉరేసుకుని యువకుడు బలవన్మరణం


సాయికృష్ణ (ఫైల్)

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో చెట్టుకు ఉరేసుకుని బొమ్మిశెట్టి సాయికృష్ణ(26) ఆత్మహత్య చేసుకున్నాడు. స్కూల్ వెనుక వైపున వడ్డెర కాలనీలో నివాసం ఉండే సాయికృష్ణ బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. గురువారం తెల్లవారుజాము వరకు ఇంటికి రాకపోవడంతో అతని కుటుంబీకులు సమీప ప్రాంతాల్లో వెతికారు. బాలికల హైస్కూల్ ఆవరణలోని చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దించారు. సాయికృష్ణ ఏడాదిన్నర క్రితమే నందిని అనే అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక పాప ఉంది. ఇంట్లో జరిగిన చిన్నపాటి వాగ్వివాదం కారణంగా ఉరేసుకుని ఉంటాడని కుటుంబీకులు భావిస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బాలానగర్: మండలంలోని ఈదమ్మగడ్డతండాకు చెందిన అంజమ్మ (41) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్‌ఐ తిరుపాజీ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని ఈదమ్మగడ్డతండాకు చెందిన అంజమ్మ ఆస్తి పంపకంలో కలత చెంది బుధవారం రాత్రి ఇంటి వద్ద పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబసభ్యులు మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్‌లో జిల్లా మెజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం సేకరించగా ఆస్తి పంపకంలో జరిగిన అన్యాయంపై కలత చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పిందని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పొగాకు నిర్మూలిద్దాం..

- జిల్లా కేంద్రంలో బహిరంగానే ధూమపానం
- జోరుగా నకిలీవి సరఫరా
- సిగరేట్లు కాల్చే వారి సంఖ్య పెరుగుదల
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



మహబూబ్‌నగర్ క్రైం: నేటి యువత.. జీవితంలో ఎంజాయ్ చేస్తున్నామనే భావనలో ప్రాణాంతక వ్యాధులను కొని తెచ్చుకుంటున్నారు. సిగరేట్ కాలినట్లే తమ ఆరోగ్యం కాలిపోతుందనే విషయం గమనించలేకపోతున్నారు. జిల్లాలో యుక్త వయసు వచ్చిన విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు సిగరేట్, బీడీ, తంబాకు, జర్దా, గుట్కా వంటి మత్తు పొగాకు మోజులో ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు. సరదాగా మొదలుపెట్టి చివరకు బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. గుట్కాను ప్రభుత్వం నిషేధించినా జిల్లా కేంద్రంలో మాత్రం విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నాయి. నియంత్రించే అధికారులు చోద్యం చూస్తున్నారు. వాస్తవానికి గుట్కా తంబాకుల తినడమే ప్రమాదకరం. ఇవి తినడం వల్ల వివిధ రకాల రోగాలు వస్తాయని వైద్యులు చెబుతున్నా తినేవారిలో మార్పురావడం లేదు. ప్రభుత్వం ఈ పదార్థాలను నిషేధించింది. కాని ఇది ఎక్కడా కూడా అమలు కావడం లేదు. ఇప్పటి వరకు పట్టణంలో మూడు నుంచి నాలుగు సార్లు మాత్రమే గుట్కా విక్రయాలను పట్టుకున్నారు. దీన్నిబట్టి ఏ స్థాయిలో అధికారులు పని చేస్తున్నారో తెలుస్తుంది. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

■ జిల్లాలోని 12లక్షల జనాభాలో సుమారు 7లక్షల మందికి పైగా పొగాకును పలు రకాలుగా వాడుతున్నట్లు అంచనా. ఇందులో 4లక్షల మేర యువతనే ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ధూమ పానానికి, ఇతర పొగాకు మత్తు పదార్థాలకు యువతే ఎక్కువగా బానిసలవుతున్నారు. కళాశాలలో చేరగానే ధూమపానం చేయడం ఫ్యాషన్‌గా మారింది.

బహిరంగ ధూమపానం నేరం

ధూమపానం నష్టాన్ని గుర్తించిన పాలకులు 2003లో బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నేరమని కోర్టు చట్టం తీసుకువచ్చారు. చట్టం ప్రకారం ప్రయాణ ప్రాంగణాలు, పార్కులు, రోడ్లపై, సినిమా థియేటర్లు బహిరంగ ప్రదేశాల్లో పొగతాగితే చట్టరీత్యా చర్యలతో పాటు జరిమానా విధించాలి. కానీ జిల్లాలో ఇప్పటి వరకు పది కేసులు మాత్రమే నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. సిగరేట్ తాగడం ఆరోగ్యానికి హానికరమని ప్యాకెట్లపై ముద్రించి వదిలేస్తున్నారు.

కన్పించని తనిఖీలు

పొగాకు విక్రయాలను అరికట్టేందుకు పోలీసులతోపాటు పురపాలక, పంచాయతీ శాఖ, ఆహార తనిఖీ అధికారి, ఆర్టీఓ, కార్మికశాఖ, విజిలెన్స్ అధికారులు ఈ విక్రయాలను అరికట్టేందుకు దాడులు నిర్వహించవచ్చు. కానీ ఎక్కడా ఆశించిన స్థాయిలో దాడులు జరగడం లేదు. నామమాత్రంగా అప్పుడప్పుడు పోలీసులు మాత్రమే ఈ గుట్కా విక్రయాలను పట్టుకుంటున్నారు. పలు చోట్ల దర్జాగా దుకాణాల్లో నిల్వ ఉంచి సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా వీరన్నపేట, వన్‌టౌన్, భగీరథకాలనీ, పాన్‌చౌరస్తా, క్లాక్‌టవర్, మార్కెట్ రోడ్, పాత బస్టాండ్, న్యూటౌన్‌లోని మున్సిపాల్ కాంప్లెక్స్, జిల్లా ఆస్పత్రి ఎదురుగా ఉన్న హోటల్స్, పద్మావతి కాలనీ, శ్రీనివాసకాలనీ, రాజేంద్రనగర్‌లో ఉన్న దుకాణాల్లో జోరుగా గుట్కా వ్యాపారం సాగుతుంది.

జీర్ణ వ్యవస్థకు దెబ్బ

గుట్కా తింటున్న వారిలో మొదట జీర్ణ వ్యవస్థ దెబ్బతింటుంది. దానితో పాటు అల్సర్ దారి తీస్తుంది. ముఖ్యంగా నోటి క్యాన్సర్ వస్తుంది దాని వల్ల ప్రాణహాని కూడా ఉంటుంది. కడుపులో పేగులకు చిన్న పుండ్లు అవుతాయి. ముఖ్యంగా నోటిలో చీగుర్ల వాపు, దంతాలు చెడిపోవడం ఇతర రకాల సమస్యలు వస్తాయి. ఇలాంటి చెడు అలవాట్లకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండటం మంచింది. సిగరేట్ కాల్చిన వెంటనే ఆరు సెంకడ్లలో నికోటిన్ మెదడుకు చేరుతుంది. ఇది చాలా ప్రమాదకారి హానికర పదార్థాలతో ఊపిరితిత్తుల క్యాన్సర్, మెదడు సంబంధిత వ్యాధులు వస్తాయి.

– బాల శ్రీనివాస్, జనరల్ ఫిజిషియన్

టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో ప్లాస్టిక్ నిషేధం

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్ కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌ని పూర్తిగా ప్లాస్టిక్ రహితంగా చేయాలని, ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు తెలిపారు. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ కవర్ల వల్ల ఫారెస్ట్‌లోని జంతువులకు హాని కలుగుతుందన్నారు. నాగర్‌కర్నూల్ నుంచి శ్రీశైలం రహదారి నల్లమల్ల అటవీ గుండా ఉన్నందున ప్రయాణికులు ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దని ప్రత్యామ్నాయం వైపు ఆలోచించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాటర్ బాటిల్ స్థానంలో స్టీల్, గాజు సీసాతో కూడిన బాటిల్స్ వాడాలని, ప్లాస్టిక్ సంచులకు బదులు గన్నీ, పేపర్ బ్యాగులను వాడాలని సూచించారు. అధికారులు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ప్రయాణికులు ప్లాస్టిక్ కవర్లు తీసుకపోకుండా జాగ్రత్త వహించాలన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని గ్రామాల తరలింపు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, అటవీ శాఖ, పంచాయతీరాజ్ శాఖ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎండోమెంట్ అధికారులు పాల్గొన్నారు.

నల్లమలలో ప్లాస్టిక్‌పై సంపూర్ణ నిషేధం

మన్ననూర్: వన్యప్రాణి సంరక్షణలో భాగంగా అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధిస్తున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వును ప్లాస్టిక్ రహిత జోన్‌గా మార్చాలన్న ప్రణాళికలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాచరణ రూపొందించామన్నారు. ఈ క్రమంలో ప్లాస్టిక్, మల్టీ లేయర్ ప్లాస్టిక్, పీఈటీ గ్లాసులు, 1- 2 లీటర్లు అంతకంటే తక్కువ సామర్థ్యం కలిగిన సీసాలను నిషేధిస్తున్నట్లు చెప్పారు. జూలై 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం పూర్తిస్థాయిలో అమలులోకి వస్తుందన్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో, పర్యాటకులు, సందర్శకులకు త్వరలోనే అవగాహన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ముఖ్యంగా శ్రీశైలం- హైదరాబాద్, మన్ననూర్- మద్దిమడుగు ప్రధాన రహదారుల్లోని అటవీ సమీప ప్రాంతాల్లో వాహనాలు నిలపడం, ఆటవిడుపు కార్యక్రమాలు, చెత్తాచెదారం వేయడం చేయరాదన్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972, అటవీ శాఖ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి


మృతి చెందిన ఉపాధి కూలీ చెంత తోటి కూలీలు

గోపాల్‌పేట/నవాబుపేట: వడదెబ్బకు గురై ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. ఉన్నచోటే కుప్పకూలి వృద్ధుడు మృతి చెందిన ఘటన రేవల్లి మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిరుపతిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కేశంపేటకు చెందిన పూడూరు మల్లయ్య (75) గురువారం సొంత పనిమీద మండల కేంద్రానికి వచ్చి టిఫిన్ సెంటర్‌కు వెళ్లాడు. వడదెబ్బకు గురై కూర్చున్న చోటే కుప్పకూలిపోయాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. కూతురు సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తోటి కూలీలు చూస్తుండగానే..

తోటి కూలీలు చూస్తుండగా కుప్పకూలీ అక్కడికక్కడే ఉపాధి కూలీ మృత్యువాత పడ్డాడు. గురువారం నవాబుపేట మండలంలోని బంగ్రంపల్లికి చెందిన బిచ్చపు చంద్రయ్య(58) గ్రామస్తులతో కలిసి ఉపాధి పనికి వెళ్లాడు. అక్కడ పనిచేసి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో పొలాల చెంతనే నడుస్తూ కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు ఆస్పత్రికి తరలించిన అప్పటికే మృతి చెందాడు.

పోలీస్‌స్టేషన్‌లో కారుకు నిప్పు

కృష్ణా: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిలిపిన కారుకు పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన వ్యక్తిని గురువారం సాయంత్రం రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ నవీద్ తెలిపారు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో కర్ణాటకలోని శక్తినగర్‌కు చెందిన నర్సింహరాజ్ తన కారును మండలంలోని టైరోడ్డులో అడ్డుపెట్టి ప్రయాణికులకు ఇబ్బందులకు గురిచేవాడు. ఎస్‌ఐ నవీద్ అక్కడకు చేరుకుని ఆయనను, కారును అదుపులోకి తీసుకుని స్టేషన్ తరలించారు. ఆ తర్వాత నర్సింహరాజ్‌ను విడిచి పెట్టి కారును మాత్రమే స్టేషన్‌లో ఉంచుకున్నారు. అర్ధరాత్రి మళ్లీ నర్సింహరాజ్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని తన కారుపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టి పారిపోయాడు. సీసీ కెమెరాలను పరిశీలించగా నర్సింహరాజ్ నిప్పు పెట్టినట్లు తెలియడంతో ఆయనను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిషేధిత గుట్కాలు స్వాధీనం



నాగర్‌కర్నూల్ క్రైం: దుకాణంలో నిల్వ ఉంచిన నిషేధిత గుట్కాలు పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రానికి చెందిన సంతోష్ పాత మార్కెట్‌లో ఓ దుకాణాన్ని అద్దెకు తీసుకుని అందులో దాదాపు రూ.5లక్షల విలువ చేసే నిషేధిత గుట్కాలను నిల్వ ఉంచాడు. సీసీఎస్ పోలీసులకు సమాచారం అందడంతో సీఐ శంకర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి గుట్కాలు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ కనకయ్యగౌడ్ తెలిపారు.

షాలీ పహిల్వాన్ ఉర్సు ప్రారంభం


తహసీల్దార్ కార్యాలయం వద్ద గంధంతో ఆర్డీఓ రాంచందర్, తహసీల్దార్ మంజుల, మత పెద్దలు

- భక్తిశ్రద్ధలతో గంధోత్సవం
- నేడు సర్ ముబారక్ దర్గాలో చిన్న కిస్తీలు


విద్యుత్‌కాంతుల వెలుగులలో దర్గా

అలంపూర్/అలంపూర్ రూరల్: షాలీ పహిల్వాన్ ఉత్సవాలు ఆరంభమయ్యాయి. పట్టణంలోని దర్గాలో గురువారం గంధోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ ముబారక్, దడ్ ముబారక్ దర్గాలను ముస్తాబు చేశారు. మత సామరస్యాన్ని చాటుతూ గురువారం రాత్రి గధంతో ప్రారంభమైన ఉర్సు జూన్ 2వ తేదీ వరకు కొనసాగుతుంది. భక్తుల కోసం నిర్వాహక కమిటీ తగు సౌకర్యాలు ఏర్పాటు చేసింది. ఆయా శాఖల సమన్వయంతో అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఉర్సులో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గంధోత్సవం

అలంపూర్ షాలీ పహిల్వాన్ ఉర్సు గంధోత్సవంతో ఆరంభించారు. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా ఖాజ బందేనవాజ్ దర్గా నుంచి వచ్చిన గంధంతో ఉత్సవాలను ప్రారంభించారు. తరతరాల సాంప్రదాయాలకు స్వాగతం పలుకుతూ ఉత్సవాలను కొనసాగించారు. గంధోత్సవం ఉర్సు నిర్వాహకులు ఖాదర్ వలి ఇంటి నుంచి బాజాభజంత్రీలతో బయలుదేరి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. అక్కడ అధికారులతో మత పెద్దలు గంధంతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సాంప్రదాయబద్ధంగా గంధోత్సవాన్ని నిర్వహించారు. అక్కడి నుంచి దర్గాలకు గంధంను ఊరేగింపుగా తీసుకెళ్లి ఉత్సవాలను ప్రారంభించారు. వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రెండో రోజు సర్ ముబారక్ దర్గాలో చిన్న కిస్తీ పోటీలు జరగనున్నాయి. సర్ ముబారక్ దర్గా వద్ద భక్తులు తమ మొక్కులు తీర్చుకుని ప్రసాదం కానుకలను సమర్పిస్తారు. అక్కడ ఉన్న భక్తులు కిస్తీలలో వేసిన ప్రసాదం కోసం పోటీపడతారు. ఈ పోటీలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త, చిత్రంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

- అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త

అచ్చంపేట రూరల్: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. గురువారం ఉమామహేశ్వర క్షేత్రంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడితోపాటు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వైశ్యుల ఎన్నో ఏళ్ల కల అయిన ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు నిరుపేద వైశ్యులకు అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో ఆర్యవైశ్యులకు అందేలా చూస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉప్పల శ్రీనివాస్ గుప్త చెప్పిన విధంగా రానున్న రోజుల్లో నామినేటెడ్ పదవుల్లో ఆర్యవైశ్యులకు అవకాశం కల్పిస్తామన్నారు. ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దామోదర్‌శెట్టి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ప్రశాంత్, సుధాకరయ్య, అశోక్, జిల్లా యూత్ అధ్యక్షుడు రాజు, మహిళా అధ్యక్షురాలు సాయిజ్యోతి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంబ చంద్రశేఖర్, మహిళా ప్రధాన కార్యదర్శి మంజుల, ఆలయ కమిటి చైర్మన్ కందూరి సుధాకర్, అశోక్ గుప్త, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు కట్ట రవికుమార్, కోశాధికారి నరేష్, శ్రీధర్, లోకేష్, రవి కుమార్, శ్రీనివాస్, మంజుల, అంజయ్యస్వామి, శ్రావణ్, రమేష్, పాండు, రజనీకాంత్ పాల్గొన్నారు.

పట్టపగలే రెండు ఇళ్లలో చోరీ

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో పట్టపగలే రెండు ఇళ్లలో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో వడ్డేశ్రీను కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈయన ఇంటికి కొద్దిదూరంలో తన అల్లుడు, కూతురు వారి సైతం అదే కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. గురువారం వడ్డేశ్రీను అల్లుడు రామకృష్ణ వారి ఇంటిదేవుడికి మొక్కు తీర్చుకునేందుకు కొత్తకోటకు వెళ్లారు. సాయంత్రం 7గంటల ప్రాంతంలో అందరూ ఇంటికి వచ్చి ఎవరి ఇళ్లలో వారు చూసుకోగా బీరువా పగులగొట్టి కనిపించింది. వడ్డేశ్రీను ఇంట్లో రూ.20వేలు చోరీకి గురయ్యాయి. అలాగే తన అల్లుడు ఇంటి తలుపు ఒకటి పగులగొట్టి బీరువాలో ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న రూ.3లక్షల నగదు, రెండు బంగారు చైన్‌లు, చోరీకి గురైనట్లు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాలకు పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

బీడీ కార్మిక సమస్యలపై ఐక్య ఉద్యమాలు



అమరచింత: బీడీ కార్మికుల వేతన పెంపు విషయంలో ఫ్యాక్టరీ యాజమాన్యం అవలంభిస్తున్న వైఖరికి వ్యతిరేకంగా త్వరలోనే అన్ని బీడీ కార్మిక సంఘాలతో కలిసి ఐక్యపోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం అన్నారు. మండల కేంద్రంలోని అమృతం బీడీ ఫ్యాక్టరీలో గురువారం కార్మికులతో సమావేశమయ్యారు. ఏప్రిల్ నెల నుంచి బీడీ కార్మికులకు పెరిగిన వేతనాలు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటి వరకు వెయ్యి బీడీల తయారీకి కేవలం రూ.207 చెల్లిస్తున్నారని వీటిపై కార్మిక సంఘాల డిమాండ్‌ను స్వీకరించని యాజమాన్యం అదనంగా రూ.20 పెంచుతామని చెప్పడం వింతగా ఉందన్నారు. నిజామాబాద్‌లో వెయ్యి బీడీల తయారీకి రూ.245.8 పైసలు ఇస్తున్నారని తెలిపారు. వీటితో పాటు యాజమాన్యం రూ.25 పీఎఫ్ జమ చేస్తున్నారని వీటిని అనుగుణంగా ఇక్కడి కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. బీడీ కార్మికులు ఆందోళనలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. సామెలు, రాజు, వెంకటరెడ్డి, అలివేలమ్మ, నీలమ్మ, అనసూయమ్మ పాల్గొన్నారు.

యజమానులు మొండి వైఖరి వీడాలి

చిన్నచింతకుంట: బీడీ కార్మికుల సమస్యల పరిష్కారంపై యజమానులు మొండి వైఖరి వీడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సూర్యం విమర్శించారు. గురువారం ఉంద్యాలలోని మోటార్ మార్క్ బీడీ ఫ్యాక్టరీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. చర్చలు వాయిదా వేయడం సరైన పద్ధతి కాదన్నారు. వెంకటన్న, వెంకటేశంగౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

కొత్తకోటలో ఆయుర్వేద క్లినిక్ సీజ్


సీజ్ చేసిన సాయిరాం ఆయుర్వేద క్లీనిక్

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 'సాయిరాం ఆయుర్వేదిక్ క్లీనిక్'ను అనుమతులు లేకుండా నడుపుతున్నారనే సమాచారంతో గురువారం సాయంత్రం జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్ తనిఖీ చేసి సీజ్ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఆయుర్వేదిక్ మందులు ఇస్తున్నారంటూ ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జనం పెద్ద ఎత్తున వచ్చారు. దీంతో కొందరు ఫిర్యాదు చేయగా జిల్లా వైద్యాధికారి స్పందించి రెండు రోజుల క్రితం తనిఖీ చేసేందుకు కొత్తకోటకు రాగా క్లీనిక్ మూసి ఉండటంతో వెనుతిరిగారు. గురువారం సాయంత్రం డీఎంహెచ్ఓ ఆకస్మికంగా క్లీనిక్‌ను తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పాటు మందులు సరైనవేనా? నకిలీవా? అనే పరీక్షలు నిర్వహించేందుకు హైదరాబాద్ నుంచి అధికారులు వచ్చి విచారణ చేస్తారని అప్పటి వరకు క్లీనిక్‌ను నడపవద్దని నిర్వాహకుడికి సూచిస్తూ క్లీనిక్‌ను సీజ్ చేశారు.